# ఈ సూచనలు పాటిస్తే మీరు పొగ తాగడం సులభంగా మానేస్తారు..! తరువాత కూడా ఎలాంటి హాని కలగదు..!



పొగ తాగడం వల్ల ఎవరికైనా ఎంతటి దుష్ఫలితాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. స్మోకింగ్ వల్ల ఊపిరితిత్తులు చెడిపోతాయి. రక్తం నాణ్యత తగ్గిపోతుంది. గుండెకు ఎఫెక్ట్ అవుతుంది. మెదడు పనితీరు మందగిస్తుంది. సంతానం కలిగే అవకాశాలు తగ్గిపోతాయి. శ్వాసకోశ సమస్యలు వస్తాయి. ఇవే కాదు, పొగతాగడం వల్ల క్యాన్సర్ వస్తుంది. అది శరీరంలోని ఏ భాగానికైనా ఎఫెక్ట్ అవుతుంది. ఈ క్రమంలో ఒకానొక సందర్భంలో ప్రాణాపాయ స్థితి కూడా కలుగుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే చాలా మంది పొగతాగడం మానేయాలని అనుకుంటారు. కానీ మానలేకపోతారు. ఇంకా కొందరు పొగ తాగడం మానేస్తారు. కానీ వారికి పలు ఆరోగ్య సమస్యలు ఇంకా ఎదురవుతూనే ఉంటాయి. ఈ క్రమంలో పొగ తాగడం మానేయలేకపోతున్న వారే కాదు, మానేశాక తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులు వివరిస్తున్నారు. వాటిని పాటిస్తే పొగ తాగడం సులభంగా మానేయడమే కాదు, ఆ తరువాత కూడా ఎలాంటి సమస్యలు రాకుండా ఆరోగ్యంగా ఉంటారు.

పొగ తాగడం మానేయలేక పోతున్నవారు ముందుగా చేయాల్సిన పని వైద్యుడి దగ్గరికి వెళ్లడం. వైద్యుడి దగ్గరికి వెళ్లి స్మోకింగ్ మానేయడం గురించి, దాని తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ముందుగా తెలుసుకోవాలి. అనంతరం ఈ స్టెప్స్ పాటించాలి. దీన్నే స్టార్ట్ మెథడ్ అని కూడా అంటారు. %వా= ాావ్ ఖ నబఙ్ ఞ్వ%. ( మీరు పొగ తాగడం ఎప్పటి నుంచి మానేస్తున్నారో ఆ తేదీని ముందుగా నిర్ణయించుకోవాలి). . (పొగ తాగడం మానేయాల్సిన తేదీ వస్తుంటే గాభరా పడకూడదు. అందుకోసం మానసికంగా సిద్ధంగా ఉండాలి. అందుకు తగిన విధంగా ప్లాన్ చేసుకోవాలి).

కౌన్సిలింగ్ అవసరం..


మానసిక వైద్యున్ని సంప్రదించాలి. స్మోకింగ్ మానేస్తున్నానని చెప్పి అందుకు తగిన విధంగా సన్నద్ధులు అవడం కోసం ఆ వైద్యుల నుంచి కౌన్సిలింగ్ తీసుకోవాలి. అవసరం అయితే గ్రూప్ కౌన్సిలింగ్ వంటి వాటిలోనూ పాల్గొనాలి. స్మార్ట్‌ఫోన్ యూజర్లైతే వారికి గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ స్టోర్‌లలో స్మోకింగ్‌ను మానేసేందుకు ఉపయోగపడే కొన్ని యాప్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిని ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని ఉపయోగించాలి. పొగతాగడం మానేసేందుకు వైద్యులు కొన్ని మందులను సూచిస్తారు. వాటిని క్రమం తప్పకుండా ఉపయోగించాలి. నికోటిన్ ప్యాచ్, నికోటిన్ గమ్, నికోటిన్ బిళ్లలు, ఇన్‌హేలర్స్, నాసల్ స్ప్రేలు మెడికల్ షాపుల్లో దొరుకుతాయి. వాటిని ఉపయోగించాలి. పొగ తాగడం మానేయడం వల్ల ఎలాంటి అద్భుతమైన ఫలితాలు కలుగుతాయో వాటి గురించే ఎల్లప్పుడూ ఆలోచించాలి.

ఎన్నో లాభాలు..

స్మోకింగ్ మానేసిన వ్యక్తుల్లో కొద్ది రోజులకే బీపీ అదుపులోకి వస్తుంది. రక్తం శుద్ధి అవుతుంది. రక్త సరఫరా మెరుగు పడుతుంది. దగ్గు వంటి శ్వాసకోశ సమస్యలు తొలగిపోతాయి. గుండె సంబంధ వ్యాధులు రాకుండా ఉంటాయి. క్యాన్సర్లు వచ్చే అవకాశం తగ్గుతుంది. పొగ తాగడం మానేసిన వారు శ్వాస సమస్యతో సతమతమవుతుంటారు. ఇందుకోసం నిత్యం శ్వాస సంబంధ వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది. ప్రశాంతమైన వాతావరణంలో నేలపై కూర్చుని ఊపిరిని నెమ్మదిగా పీలుస్తూ వదులుతూ ఉండాలి. ఒక సారి ముక్కుతో పీలుస్తూ మరో సారి నోటితో వదలాలి. మళ్లీ నోటితో పీల్చి ముక్కుతో వదలాలి. ముక్కు రంధ్రాల్లో ఒక దాన్ని మూసి, మరో దాన్ని తెరచి శ్వాస పీలుస్తూ వదలాలి. దీంతో శ్వాస సమస్యలు పోతాయి.

దగ్గు ఎక్కువగా వస్తే..

స్మోకింగ్ మానేశాక కొందరికి దగ్గు ఎక్కువగా వస్తుంటుంది. అయితే దాని గురించి బెంగ పడాల్సిన పనిలేదు. ఎందుకంటే ఊపిరితిత్తుల్లో పేరుకుపోయిన మ్యూకస్ బయటికి వెళ్తూ అలా దగ్గు వస్తుంది. అయితే దగ్గు తక్కువగా వస్తుంటే భయపడాల్సిన పనిలేదు. కానీ అదే దగ్గు ఎక్కువ రోజుల పాటు ఉంటే వైద్యున్ని సంప్రదించాలి. స్మోకింగ్ మానేసిన వారి ఊపిరితిత్తుల్లో మ్యూకస్ ఎక్కువగా పేరుకుపోయి ఉంటుంది. అలాంటి వారు తమ తమ ఇండ్లలో హ్యుమిడిఫైర్ వంటి పరికరాలను పెట్టుకుంటే స్వచ్ఛమైన గాలి వస్తుంది. దీంతో శ్వాస సక్రమంగా ఉంటుంది. అంతేకాకుండా ఇలాంటి వారు నిత్యం నీటిని ఎక్కువగా తాగుతుంటే మ్యూకస్ సమస్య తొలగిపోతుంది.



రోజుకు 30 నిమిషాల పాటు వారానికి కనీసం 5 రోజులు వరుసగా వ్యాయామం చేయాలి. ఇలా వారానికి కనీసం 150 నిమిషాల వరకు శరీరానికి వ్యాయామం అవసరం.

వీటిని పాటించాలి..

వాకింగ్, నెమ్మదిగా సైకిల్ తొక్కడం, తోటపని, స్విమ్మింగ్ వంటి వ్యాయామాలు చేస్తే స్మోకింగ్ మానేయడం వల్ల కలిగే ఎఫెక్ట్స్ నుంచి తప్పించుకోవచ్చు. ఆకుపచ్చని కూరగాయలు, పండ్లు, తృణ ధాన్యాలు, కొవ్వు తక్కువగా ఉన్న ఆహారం, చేపలు వంటి ఆహారాన్ని తరచూ తీసుకుంటే దాంతో పోషకాలు శరీరానికి సరిగ్గా అంది తద్వారా అనారోగ్య సమస్యల నుంచి బయట పడేందుకు అవకాశం ఉంటుంది. పొగ తాగడం మానేశాక చాలా రోజుల వరకు కూడా మీకున్న అనారోగ్య సమస్యలు తగ్గకపోతే సరైన వైద్య సలహా పాటించాల్సి ఉంటుంది.

# కడుపుబ్బరమా? ఈ మార్పులు, చిట్కాలతో దూరం



కడుపుబ్బరం తరచూ చూసే సమస్యే. అందరూ ఎప్పుడో అప్పుడు దీంతో ఇబ్బంది పడ్డవారే అన్నా అతిశయోక్తి కాదు. దీనికి ప్రధాన కారణం అతిగా తినటం. అనారోగ్యకర ఆహారం, గబగబా తినటం, బద్ధకంగా కూర్చోవటం వంటివీ కడుపుబ్బరానికి ( దారితీయొచ్చు. తేలికైన మార్పులు, చిట్కాలతో దీని బాధలను తగ్గించుకోవచ్చు.

బాగా నమిలి తినటం

ఆహారాన్ని ఆస్వాదిస్తూ, బాగా నమిలి తినటం ఎవరికైనా మంచిదే. ఇది తృప్తిని కలిగించటమే కాదు.. ఆహారం బాగా జీర్ణం కావటానికీ తోడ్పడుతుంది.

తక్కువ తక్కువగా తినటం

ఒకేసారి ఎక్కువెక్కువగా తింటే కడుపు ఉబ్బి ఇబ్బంది కలిగిస్తుంది. అదే తక్కువ తక్కువగా ఎక్కువసార్లు తింటే కడుపు తేలికగా ఉంటుంది. తిన్నది బాగా ఒంట పడుతుంది.

పప్పులు నానబెట్టటం

కందిపప్పు వంటి వాటిని వండటానికి ముందు నానబెట్టటం మంచిది. దీంతో పప్పులు త్వరగా ఉడుకుతాయి. తేలికగా జీర్ణమవుతాయి. కడుపుబ్బరమూ తగ్గుతుంది.

పెరుగు, మజ్జిగ


ఇవి పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందేలా చేస్తాయి. ఇలా జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేయటానికి తోడ్పడతాయి.

పీచు తగినంత

పీచు జీర్ణక్రియ సజావుగా సాగేలా చూస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. తిన్నది బాగా జీర్ణమైతే కడుపుబ్బరమూ తగ్గుతుంది.

# తీపి పదార్థాలతో పీడ కలలు

చెడ్డ, పీడ కలలతో బాధపడుతున్నారా? అయితే పడుకునే ముందు పాల పదార్థాలు.. కేకులు, బిస్కట్లు, ఐస్‌క్రీముల వంటి తీపి పదార్థాలు తింటున్నారేమో ఓసారి చూసుకోండి. కొందరిలో ఇవి చెడు కలలకు దారితీస్తున్నట్టు కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ మాంట్రియల్ అధ్యయనంలో బయటపడింది మరి. అనారోగ్యకర ఆహారం చెడ్డ కలలకు దారితీయొచ్చనే గత అధ్యయన ఫలితాలను ఇది మరింత బలపరిచింది. పీడకలల విషయంలో తీపి పదార్థాల అనంతరం పాల ఉత్పత్తులు రెండో స్థానాన్ని ఆక్రమిస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఎందుకిలా? ఆహార అలర్జీలు లేదా లాక్టోజ్ పడకపోవటం ప్రధానంగా కారణమవుతున్నాయని చెబుతున్నారు. రాత్రిపూట ఆలస్యంగా తినటం, ఆకలిని పట్టించుకోకపోవటం వంటి అనారోగ్యకర అలవాట్లతో పీడకలలు, చెడు కలలు మరింత ఎక్కువగా వస్తున్నట్టూ తేలింది. జ్ఞాపకాలను మెదడు పదిలపరచుకునేటప్పుడు పీడకలలు వస్తుంటాయని నాడీ వైద్య సిద్ధాంతాలు సూచిస్తున్నాయి. ఆందోళన, మానసిక ఒత్తిడి, వేదన వంటివి భయంకర కలలకు దోహదం చేస్తుంటాయి.



# రాగులు క్యాల్షియం గనులు



%రాగులు చూడటానికి చిన్నగానే ఉంటాయి గానీ అవి క్యాల్షియం గనులు! ప్రతి 100 గ్రాములతో సుమారు 340 గ్రాముల క్యాల్షియం లభిస్తుంది. ఇదొక్కటే కాదు.. ఐరన్, అమైనో ఆమ్లాలు, పొటాషియం, జింక్, మెగ్నీషియం, పీచు వంటి పోషకాలూ దండిగానే ఉంటాయి. అందుకే ఎముకలను బలోపేతం చేయటంతో పాటు ఊబకాయం, అధిక రక్తపోటు, రక్తంలో గ్లూకోజు, కొలెస్ట్రాల్ తగ్గటానికీ ఉపయోగపడతాయి. ఇలా గుండెజబ్బుల ముప్పునూ తగ్గిస్తాయి. అయితే రాగుల్లోని ఫైటేట్స్, ఆక్జలేట్స్ శరీరాన్ని క్యాల్షియం సంగ్రహించుకోకుండా అడ్డుతగులుతాయనీ గుర్తించాలి.

అంటే రాగుల్లో దండిగా క్యాల్షియం ఉన్నా మన శరీరం పూర్తిగా శోషించుకోలేదన్నమాట. మరోవైపు రాగులు త్వరగా జీర్ణం కావు కూడా. జీర్ణకోశ సమస్యలతో బాధపడేవారికివి అంతగా నప్పవు. కాబట్టి కొందరికి క్యాల్షియం మాత్రలు అవసరమవుతాయి. నెలసరి నిలిచే దశలో ఉన్నవారికి, నెలసరి నిలిచినవారికి క్యాల్షియం మరింత ఎక్కువగా అవసరమవుతుంది. ఎముకలు గుల్లబారకుండా చూసుకోవటానికిది తప్పనిసరి. అయితే పెద్ద మొత్తంలో ఆహారం ద్వారా క్యాల్షియం లభించేలా చూసుకోవటం కష్టం. కాబట్టి డాక్టర్లు క్యాల్షియం మాత్రలను సూచిస్తే తప్పకుండా వేసుకోవాలి. దీన్ని శరీరం చాలావరకూ సంగ్రహించుకుంటుంది. అదనంగా రాగులూ తీసుకుంటే ఇంకా ఎక్కువ ఫలితం కనిపిస్తుంది.




# మైక్రోసాఫ్ట్ సమీపానికి మార్కెట్ విలువ

## ఔన్సు ధర 62 డాలర్లకు

## ఆభరణాలు, పారిశ్రామిక వినియోగానికి

## తోడు ఈటీఎఫ్ డిమాండ్

## దేశీయ మార్కెట్లో కిలో రూ.1.93 లక్షలకు

ధర అనూహ్యంగా పెరగడంతో అంతర్జాతీయంగా వెండి ఎంతో విలువైన ఆస్తిగా సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచ అగ్రగామి ఐటీ సంస్థ మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ (మార్కెట్ కేపిటలైజేషన్) సమీపానికి వెండి మార్కెట్ విలువ చేరింది. శుక్రవారం అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాముల) వెండి ధర 62 డాలర్లకు చేరడంతో, వెండి మార్కెట్ విలువ 3.491 లక్షల కోట్ల డాలర్లని కంపెనీస్‌మార్కెట్‌క్యాప్.కామ్ వెబ్‌సైట్ తెలిపింది. ఇప్పటివరకు అంతర్జాతీయంగా వెలికి తీసిన వెండి మొత్తం 17,51,000 మెట్రిక్ టన్నులుగా అంచనా వేస్తూ, ఈ విలువను సంస్థ లెక్క వేసింది. ఈ ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక మార్కెట్ విలువ కలిగిన అయిదో ఆస్తిగా వెండి నిలుస్తోంది.

**ఇవీ కారణాలు**

రష్యా- ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టాక ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు, వివిధ దేశాల ఉత్పత్తులపై సుంకాల వడ్డింపు ఫలితంగా అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి, ద్రవ్యోల్బణం పెరిగి - వృద్ధి మందగించటం తదితర కారణాల వల్ల సురక్షితమని భావించి బంగారం, వెండి కొనుగోలు చేయడం పెరిగింది. వెండికి ఆభరణాల రంగాన్ని మించి, పారిశ్రామిక గిరాకీ అధికం. సెమీకండక్టర్, సౌర విద్యుత్తు, విద్యుత్తు వాహన విభాగాల నుంచి వెండికి గిరాకీ పెరుగుతోంది. ధర పెరుగుతున్నందున, ఎక్కువ మంది వెండి ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్)లలో పెట్టుబడి పెడుతున్నారు. ధర బాగా అధికమయ్యేందుకు ఇది దోహదపడుతోంది.

మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ 3.556 లక్షల కోట్ల డాలర్ల సమీపానికి, వెండి మార్కెట్ విలువ చేరింది. వెండి కంటే ఎక్కువ మార్కెట్ విలువ గల కంపెనీలు ప్రస్తుతం 4 మాత్రమే ఉన్నాయి. వెండి ధర ఇటీవల తగ్గినట్లే తగ్గి, మళ్లీ వేగంగా పెరిగింది. ఈ ఏడాదిలో జనవరి నుంచి ఇప్పటి వరకు వెండి ధర 115% పెరగడం గమనార్హం. మనదేశంలో కిలో వెండి ధర లోహ రూపంలో గురువారమే రూ.2 లక్షలు మించగా, శుక్రవారం ఎంసీఎక్స్ ట్రేడింగ్‌లోనూ రూ.2 లక్షలు మించినా, తరవాత తగ్గింది.

**ఫెడ్ వడ్డీరేటు తగ్గించడంతో**

అమెరికా కేంద్రబ్యాంక్ ఫెడ్ ఇటీవల వడ్డీరేటును 0.25% తగ్గించింది. దీంతో బాండ్లపై ప్రతిఫలం తగ్గుతుంది. ఫలితంగా బంగారం, వెండిపై మదుపరుల్లో ఆసక్తి మళ్లీ పెరిగింది. అమెరికా డాలర్ బలహీనపడటమూ కలిసొచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా వెండి ఉత్పత్తి కంటే, గిరాకీ ఎక్కువగా ఉ ండటమూ కారణమే.

**ధర తగ్గే అవకాశం ఉందా?**

వెండి ధర ఇప్పటికిప్పుడు తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. కానీ అనుకోకుండా ఒక్కసారిగా దిగిరావచ్చనీ బులియన్ నిపుణులు చెబుతున్నారు. దశాబ్దకాలం క్రితం మనదేశంలో కిలో వెండి ధర రూ.40,000 స్థాయి నుంచి వేగంగానే రూ.65-70 వేలకు చేరింది. అప్పుడు కిలో రూ.లక్ష కాబోతోందనే ప్రచారం జోరుగా సాగడంతో, ఎంతో మంది వెండి కొనుగోలు చేశారు. ఆ తర్వాత ఏడాదిలోపే మళ్లీ రూ.40,000 కంటే దిగువకు వెండి ధర పతనం అయింది. ఆ తర్వాత మళ్లీ ధర పెరగడానికి ఇంతకాలం పట్టింది. ప్రస్తుతానికి వెండి ధర 'ఓవర్ వాల్యుయేషన్' దశలో ఉందని.. లాభాల స్వీకరణ జరిగినా, ఫిజికల్ కొనుగోళ్లు తగ్గినా, ఈటీఎఫ్ డిమాండ్ క్షీణించినా, ఒక్కసారిగా ధర దిగిరావచ్చని అంటున్నారు. కానీ రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ముగిసి, ట్రంప్ విధానాల్లో అనిశ్చితి తొలగితేనే వెండి ధర బాగా తగ్గే అవకాశం ఉంటుందని సంబంధిత వర్గాలు వివరిస్తున్నాయి.

రూ.7,000 తగ్గిన కిలో వెండి ధర: హైదరాబాద్ బులియన్ విపణిలో గురువారం కిలో వెండి ధర రూ.2,00,100 (అన్ని పన్నులతో కలిపి) వద్ద ముగియగా, శుక్రవారం రాత్రి రూ.7,000 తగ్గి రూ.1,93,100కు పరిమితమైంది.

బంగారం ధర శుక్రవారం అంతర్జాతీయంగా ఔన్సు 4297 డాలర్లకు చేరడంతో, దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,36,000కు (అన్ని పన్నులతో కలిపి) చేరింది

షేరు ధర ప్రకారం అంతర్జాతీయ అగ్రగామి మార్కెట్ విలువ కలిగిన కంపెనీలు




# నేర్చుకోవడానికి వెనకాడితే భవిష్యత్తు ఉండదు

## మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్

ముంబయి: కృత్రిమ మేధ (ఏఐ) వల్ల ఉద్యోగాలు పోవని, అయితే ఆ సాంకేతికతను నేర్చుకోవడానికి వెనకాడితే మాత్రం భవిష్యత్తు ఉండకపోవచ్చని మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ అభిప్రాయపడ్డారు. ఒక ఉద్యోగం కింద చేసే పనులను, ఈ కొత్త తరం సాంకేతికత వేర్వేరుగా విభజిస్తుందన్నారు. 'స్థిరమైన, దీర్ఘకాలం పాటు వృత్తిజీవితాలను కొనసాగించే చివరి తరం మనదే అవుతుంది. మన పిల్లలు పలు ఉద్యోగాలను నిర్వహించొచ్చ'ని మైక్రోసాఫ్ట్ ఏఐ టూర్‌లో పాల్గొన్న వారిని ఉద్దేశించి ఆయన అన్నారు. 'మనం ఇపుడు రోజూ పోరాటం చేయాల్సిందే. కొత్త విషయాలను నేర్చుకోవాల్సిందే. ఆక్సిజన్ మాస్కుని ఎలా వేసుకోవాలో మనం ఇపుడు నేర్చుకుంటున్నాం కదా' అని అన్నారు. దిల్లీలో కాలుష్యాన్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. ఏఐ మోడళ్లు కంపెనీలకు ఒక వస్తువుగా, డేటా ఒక వ్యూహాత్మక ఆస్తిగా మారుతుందని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలో మైక్రోసాఫ్ట్ ఏఐ టూల్స్‌ను సైబర్ భద్రతకు వినియోగిస్తున్నారని నాదెళ్ల గుర్తు చేశారు. అదానీ సిమెంట్, యెస్ బ్యాంక్, ఆదిత్య బిర్లా గ్రూప్, ఎల్‌టీఐమైండ్‌ట్రీ వంటి కంపెనీలు తమ ఏఐ క్లయింట్లని సత్య నాదెళ్ల వెల్లడించారు.

# బీమా రంగంలో 100% ఎఫ్‌డీఐ

## బిల్లును ఆమోదించిన కేంద్ర మంత్రివర్గం

**ముఖ్యంగా శాఖల విస్తరణ, ఉద్యోగుల నియామకాల వంటి విషయాల్లో బోర్డు సొంతంగా నిర్ణయాలు తీసుకునేందుకు వీలు కల్పించనుంది. 2047 నాటికి దేశంలో అందరికీ బీమా రక్షణ ఉండాలనే లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది.**


దిల్లీ: బీమా రంగంలో భారీ సంస్కరణల దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితిని ప్రస్తుత 74% నుంచి 100 శాతానికి పెంచే బిల్లుకు శుక్రవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈనెల 19న ముగియనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే బీమా సవరణ బిల్లు-2025ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఇప్పటివరకు బీమా రంగంలోకి ఎఫ్‌డీఐ రూపంలో రూ.82,000 కోట్లు వచ్చాయి.

ఇన్సూరెన్స్ చట్టం-1938లో సవరణలు చేసి, జీవిత, సాధారణ బీమా రెండింటినీ ఒకే సంస్థ అందించే విధంగా కాంపోజిట్ లైసెన్స్ విధానాన్ని తీసుకురావాలని కొత్త బిల్లు నిర్ణయించింది.

ఎఫ్‌డీఐ పెట్టుబడులను మరింతగా ఆకర్షించడంతో పాటు, బీమా కంపెనీల ఏర్పాటుకు అవసరమైన మూలధన నిబంధనలను తగ్గించాలని బిల్లులో ప్రతిపాదించారు.

ఇన్సూరెన్స్ చట్టం-1938తో పాటు, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) చట్టం-1956, భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) చట్టం-1999లకు సవరణలను ఈ బిల్లులో పొందుపర్చారు.


ఎల్ఐసీకి మరింత స్వేచ్ఛ: ఎల్ఐసీ చట్టంలో చేయబోయే సవరణల ద్వారా ఆ సంస్థ బోర్డుకు నిర్వహణపరమైన నిర్ణయాల్లో స్వేచ్ఛ లభించనుంది. ముఖ్యంగా శాఖల విస్తరణ, ఉద్యోగుల నియామకాల వంటి విషయాల్లో బోర్డు సొంతంగా నిర్ణయాలు తీసుకునేందుకు వీలు కల్పించనుంది. 2047 నాటికి దేశంలో అందరికీ బీమా రక్షణ ఉండాలనే లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు బీమా చట్టంలో మార్పులు అవసరమన్నది ప్రభుత్వ ఆలోచన. దీనివల్ల మార్కెట్లోకి కొత్త సంస్థలు వచ్చి, బీమా విస్తృతి పెరుగుతుందని భావిస్తోంది.



# పెట్రోలియం, గ్యాస్ రంగంలో మరింత సులభతర వ్యాపారం

## 30 ఏళ్ల పాటు లీజుకు అనుమతి

## కొత్త నిబంధనల నోటిఫై



దిల్లీ: చమురు, గ్యాస్ రంగంలో సులభతర వ్యాపార విధానాలను మెరుగుపరచి, మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సరికొత్త నిబంధనలను కేంద్రం అమల్లోకి తెచ్చింది. ఆ మేరకు 'న్యూ పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రూల్స్-2025'ను ప్రభుత్వం నోటిఫై చేసింది. అంతక్రితం ఉన్న వ్యవస్థను ఇటీవల ఆమోదముద్ర పడ్డ ఆయిల్‌ఫీల్డ్స్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) అమెండ్‌మెంట్ యాక్ట్, 2025 భర్తీ చేస్తుంది. కొత్త విధానంలో 30 ఏళ్ల పాటు లీజు గడువు ఉంటుంది. క్షేత్రాల పూర్తి స్థాయి ఆర్థిక జీవితం వరకూ గడువు పొడిగించుకునే వీలుంటుంది. అసాధారణ పరిస్థితులు ఎదురైన పక్షంలో రక్షణనిచ్చే షరతులూ ఉంటాయి. ఉల్లంఘనలకు క్రిమినల్ పెనాల్టీల స్థానంలో అధిక అపరాధ రుసుము (రూ.25 లక్షల)తో పాటు, ఉల్లంఘన కొనసాగింపు జరిగితే రోజుకు రూ.10 లక్షల చొప్పున పెనాల్టీ విధిస్తారు. లీజుదార్లు మౌలిక వసతులను పంచుకోవడానికీ అనుమతి ఇచ్చారు. తద్వారా కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి వీలవుతుంది. ఇకపై పెట్రోలియం లీజు దరఖాస్తులపై 180 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలి. వివాదాల పరిష్కారానికి వేగవంతమైన వ్యవస్థనూ తీసుకొచ్చారు. 'తాజా నిబంధనలు ఒక మైలురాయిలాంటివి. వ్యాపారాలు, కార్యకలాపాలను సులభరీతిన నిర్వహించుకోవడానికి ఈ సవరణలు చేశామ'ని చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్‌పురి పేర్కొన్నారు. ఇటువంటి సంస్కరణలను తన జీవితకాలంలో చూస్తానని అనుకోలేదని మంత్రి వివరించారు. దేశీయ చమురు అవసరాల్లో కనీసం 50 శాతాన్ని స్థానికంగా ఉత్పత్తి చేసేందుకు, ఈ సంస్కరణలు ఉపయోగ పడతాయనే ధీమా వ్యక్తం చేశారు.

